
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# మంచివాడు మా బాబాయి

యన్.కె.రామారావు

**బాబాయి కవీ, రచయిత, గాయకుడు, వక్తా కాదు. రాజకీయాలు తెలియవు. కానీ చిక్కేమిటంటే తనకు అన్నింటిలో ప్రావీణ్యం వుందని బుకాయిస్తాడు. అందుకే అతడంటే నాకు కోపం...**

అద్దెకు దిగిన కొత్త ఇంట్లో సామానులు సర్దుకోవడంలో భాగంగా ''ఇదో ఈ మహ్మద్ రఫీ'' ఫోటో ఆ టీపాయి మీద వుంచు అన్నాను నా భార్యతో.



''మీరయితే ఫోటో అంటారు. నేనూ, ఆమాటకొస్తే నా అనుంగు శిష్యులైన స్థానిక కవులం మాత్రం చాయా చిత్రమనే అంటాం'' అంటూ ఒక అపరిచిత స్వరం వినిపించింది. నా గుండె మామూలుగా కొట్టుకోవడం ఒక క్షణం పాటు మానేసి మళ్లీ గాడిలో పడింది. నేనింతకు ముందున్న ఇంట్లో ఒక పోర్షన్‌లో ఒక ఔత్సాహిక గాయకుడుండేవాడు. మొదటిసారి అనేక రకాలయిన వన్యమృగాలు వూళ్లో కొచ్చి మా ఇంటిని చుట్టుముట్టాయని భయపడి వణికిపోయాను. తర్వాత అన్ని రకాల ధ్వనులు మా పొరుగువాడి సొంత గాత్రం తాలూకువని తెలుసుకొని నిమ్మళపడ్డాను. అతడిని గానం మానేసి వెంట్రిలాక్విజం సాధన చేయమన్నాను. కానీ నా సలహాను పెడచెవిన పెట్టాడు. ఏడాది పాటు రాత్రుళ్లు నిద్రకు వెలియై ఈ అయిదు పోర్షన్ల వాటాకొచ్చి పడ్డాను. కానీ....

తలెత్తి చూసేసరికి గుమ్మానానుకొని రెండు చేతులూ కట్టుకొని విలాసంగా నవ్వుతున్న సుమారు ఒక యాభై అయిదేళ్ల శాల్తీ కనిపించింది. మామూలు ఎత్తు, జుట్టూ మీసాలు తెల్లబడిపో

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

యాయి. బలిష్టంగా వున్నాడు. లాల్చీ-పైజమా ఆపాదమస్తకం సన్నగా కంపిస్తూండగా అతని ముఖం వైపు చూశాను.

"నా పేరు హన్మంతరావు. నేను ఈ చుట్టుపక్కల వూళ్లల్లో ప్రసిద్ధ కవిని. నాకు చాలా మంది శిష్యులున్నారీ వూళ్లో పై పెచ్చు "బాబాయి" అంటూ నన్ను అందరూ ఆప్యాయంగా పిలుస్తారు. నీవు అలా పిలవచ్చు. మృదువుగా అంటూనే పిలవాలి కూడాను ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నాడు.

"అలానా చా-లా-సం-తో-షం" మాటలు కూడబలుక్కుని అన్నాను.

"నీ పేరు నాకు తెలుసు సుబ్రావ్". నేనందరినీ అరేయ్ ఒరేయి -రా ఇలా పిలుస్తానన్నమాట. ఈ క్షణం నుంచి నిన్నూ అలానే పిలవబోతున్నానురా"

నాకు తలకాయ కొట్టేసినట్లనిపించింది. చిన్ననాటి మిత్రులు మా ఇంటి వాళ్లు, ఉపాధ్యాయులు తప్ప నన్నెవరూ అరేయి, ఒరేయి అనలేదు.

"నేనూ మిమ్మల్ని అలాగే అంటే అరేయి- ఒరేయి-రా అని పిలిచే సౌలభ్యం కల్పిస్తారా?"

"కల్పించను కాక కల్పించను. నువ్వు నన్ను సుబ్బరంగా నిరభ్యంతరంగా బాబాయనొచ్చు. అరేయి అనటాన్కి ఏమాత్రం వీలు లేదు. చదువుకున్నవాడివి. వయస్సుకు మర్యాదిచ్చే సంస్కారం పెంచుకో" అని కూకలేసాడు. బుద్ధి తక్కువైందని ఒప్పుకొన్నా.

"ఏమమ్మాయి ఆపని తర్వాత చేసుకో. ముందో కాఫీ పట్రా" అని మా ఆవిడకు ఆజ్ఞ జారీ చేసి బాబాయి ఒక కుర్చీలో కూలబడ్డాడు. ఇల్లు పూర్తిగా సర్దుకున్నాక కవిత్వం వినిపిస్తాననగానే నాకు గుండెదడ తగ్గింది. ఇప్పట్లో ఇల్లు పూర్తిగా సర్దుకోకూడదని నిశ్చయించుకొన్నాను. తదనుగుణంగా నా భార్యకు సైగచేశాను.

ఆ రాత్రి నేనూ నా భార్యా కాసేపు ఏడ్చుకున్న తర్వాత ఒకళ్లకొకళ్లం ధైర్యం చెప్పుకున్నాం.

కాకపోతే గాయకుడి పొరుగు నుంచి కవి పొరుగుకు వచ్చాం. పెనం మీంచి జారి పొయ్యిలో పడ్డాం. విధి మన మీద పగ బట్టినప్పుడు మనం ఏమీ చేయలేం. మనం దైవోపహతులం. కోరి మనం పోయిన చోటికల్లా ఆపదలొస్తాయి. ఇలా ఒకళ్లొకళ్లం ఓదార్చుకున్నాం. అంతకూ మించి వస్తే ఇల్లు ఖాళీ చేద్దాం. గాయకుడూ, కవీ లేని ఇళ్లే దొరకవా. కవులు కానీ వాళ్లకు గాయకులు కాని వాళ్లు ఈ దేశం గొడ్డు బోయిందా. ఇల్లు సంబాళించుకొని ఆరాత్రి కంటి నిండా నిద్రపోయాం.

***

"ఒరేయ్ సుబ్రావ్ ఇలారారా" అనే పిలుపుకు పూర్తిగా అలవాటు పడిపోయాను. బాబాయి నా పక్క పోర్షను వాళ్లను కూడా అలానే పిలుస్తుండడంతో నా మనసు నెమ్మదించింది. హన్మంతరావును బాబాయి అనే పిలుస్తున్నాను. అడపాదడపా మా ఇంటికొచ్చి కాఫీ అడిగి తాగి ఒకటో రెండో కవితలు వినిపించి వెళుతున్నాడు.

బాబాయి మాటల్లో తనెంత మందికి పెళ్లి సంబంధాలు చూసి పెట్టాడో ఆ సంబంధాలు చేసుకున్న వాళ్లెంత హాయిగా బతుకుతున్నారో ఇలాంటి వివరాలు విధిగా చోటుచేసుకొంటాయి.

నాకు ఏవో పాత సినిమా పాటలు వినటమో, డివిడి మీద చూడడమో ఇష్టం. సరిగ్గా అట్లాంటి సమయంలోనే దిగుతాడు బాబాయి.

"ఒరే అబ్బీ-సుబ్బీ వీళ్లేం నటులురా. నేను నాటకాల్లో వేసేటప్పుడు పడేవి చప్పట్లు ఈలలు వన్స్ మోర్‌లు. అలాంటివి నువ్వూహించను కూడా లేవనుకో"

నన్ను పిలిచే పిలుపు స్థాయి మరీ దిగజారిపోయినందుకు కొంచెం దుఃఖిస్తూ "అయితే బాబాయ్. నీలో ఒక నటుడు కూడా దాగున్నాడన్న మాట" ఉక్రోషంగానే అన్నాను.

"నటుడేమిటిరా నటుడు నాలో దాగున్న గాయకుడిని నువ్వు వింటే మళ్లీ ఈ ఛత్తాక్కారీ పాటలు విననుకాక వినవు"

భోరున ఏడుస్తూ నేనూ నా భార్య బాబాయి చెరో కాలు దొరకబుచ్చుకొని మా కన్నీళ్లతో ఆయన పాదాలు తడిపాం. కాస్త దయగా మరి కాస్త కనికరంగా "ఏంకావాలో కోరుకొమ్మని వరం ఇచ్చే దేవుడిలా పోజిచ్చాడు బాబాయి" బాబాయి

కాష్మోరాని నిద్ర లేపినట్లుగా నీలో గాయకుడిని నిద్ర లేపనని వాగ్దానం చేయి వాగ్దానం కాదు నీ ఇష్టదైవం-నీ కులదైవం- కాదు-కాదు నీ చిన్నకొడుకు మీద ప్రమాణం చేయి. ఈ చిన్న కోరిక తీర్చి ఎన్ని కాఫీలయినా తాగు. ఎన్ని కవితలయినా వినిపించు" భోరున విలపిస్తూ కాళ్లు వదలకుండా పట్టుకున్నాం"

"ఏం గాయకుడంటే అంత భయమేం" అనుమానంగా అడిగాడు బాబాయి.

"మంచి గాయకులని గౌరవిస్తాం. బాబాయి నువ్వు మంచి గాయకుడివి కావని మా నమ్మకం. నీ ముఖమే ఆ సంగతి చెపుతుంది. ప్రాణ భిక్ష పెట్టు బాబాయి"


బాబాయికి నటన, సంగీతం, కవిత్వం, కార్టూనిజం, ఇంకా చాలా విద్యలొచ్చని చెప్పాడు. కాశీకి పోకున్నా మా దంపతులపట్ల ఇష్టం వల్ల మా కాఫీ రుచి వల్ల మా ఇంట్లో పాడనని ప్రమాణం చేశాడు. మా ప్రాణాలు కుదుటపడ్డాయి.

బాబాయి స్వైర విహారం రోజు రోజుకూ నాకు తలనొప్పిగా తయారయ్యింది. రాత్రి పగలు తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు దూసుకొచ్చేస్తాడు. నా అభిరుచులకు అతని అభిరుచులకు ఆమడ దూరం. ఎవరింట్లో ఎవరు నీళ్లాడారో. ఆడపిల్లో, మగపిల్లో ఎవరు ఈ ప్రపంచంలోకి కొత్తగా దూసుకొచ్చారో ప్రసూతి కష్టమైతే తను అర్ధరాత్రి వెళ్లి ఆటోల్లాంటి వాహనమేదో కుదుర్చుకొని పెద్దాసుపత్రికి ఎలా తీసుకెళ్లాడో డాక్టర్లను ఎలా దబాయించాడో లాంటి వివరాలు పూసగుచ్చినట్లు చెప్పేవాడు.

"డాక్టర్లను దబాయించడమెందుకు బాబాయి? నిన్ను చూడగానే పులిని చూసిన మేకల్లా లాడెన్‌ను ఏకాంతంలో చూస్తే గీస్తే జార్జిబుష్‌లా వాళ్లే వణికిపోతారుగా" అమాయకంగా అంటున్నట్లు నా కసిని వాక్యంలో దట్టించేవాడిని.

"అది నిజమేననుకోరా సుబ్బిగా అయినా ఆ మాత్రం దబాయిస్తే చెప్పు కింద తేలులా వుండిపోతారు అంచేత" అంటూ తెల్ల మీసం దువ్వుకునేవాడు.

బాబాయి బాధ నా ఒక్కడికే కాదు. వూళ్లో చాలా మందితో ఇలాగే వ్యవహరిస్తున్నట్లు వార్త నాకు మనశ్శాంతినిచ్చింది. లేకుంటే ఈ లోకంలో నేనొక్కడినే అమాయక ప్రాణినని, బలయిపోతున్నానే బాధ మరీ ఎక్కువయ్యేది. విచిత్రమేమంటే



వాళ్లంతా బాబాయిని మనస్ఫూర్తిగా అభిమానిస్తారు. నా ఇంటలెక్చువల్ బ్రెయిను కంటే వాళ్లది లోస్థాయి కాబోలుననుకున్నాను.

ఒక రోజు మా పక్క వూళ్లో నాటకాల పోటీలు, పాటల పోటీలు జరుగుతున్నాయని కనీసం ఆఖరి రోజయినా రావాలని ఆర్గనైజర్ ప్రాధేయపడ్డాడు. నేనూ మరి నలుగురం ఓ సుమో మాట్లాడుకున్నాం.

నేను పిలవకున్నా బాబాయి ముందే వచ్చి ముందుసీట్లో కూర్చుని "రండర్రా ఏమిటీ ఆలీసం' 'అని అరుస్తున్నాడు. తీరా ఆ వూరు చేరి, వేదిక దగ్గర జనాన్ని చూసే సరికి పాటల పోటీలో తనకూ పాడాలని వుందని బాబాయి ప్రకటించాడు. నేను నిర్ఘాంతపోయాను.

"పాడుతా తీయగా సల్లగా" పాడుతానని ప్రకటించాడు. మాముందు ఒకసారి పాడాడు.

"బాబాయి ఇక్కడ జనం చాలా రఫ్‌గా వున్నారు. వాళ్లకు కోపం రానీకు. మనం క్షేమంగా ఇంటికి పోవాలంటే నీ కోరికను చంపుకో. పాటను మనసులోనే పాతిపెట్టు" అన్నాను.

"అదే చేయబోతున్నాను. అంటే ఇక్కడ మిగతా పోటీదార్లను శాశ్వతంగా పాతిపెట్టపోతున్నాను. అంటే పాడబోతున్నాను" బాబాయి పునరుద్ఘాటించాడు.

"బాబాయి ఇంకో పాట చూసుకో పాడుతా తీయగా" అని వాగ్దానం చేసి గాడిదలా పాడితే జనం ఊర్కోరు" అన్నాను.

అక్కడ నుంచి సుమారు మైలు దూరం పరిగెత్తాను. ప్రమాదో ధీమతో మపి అన్నారు పెద్దలు. నేను తిరిగి వచ్చేసరికి బాబాయి చేతిలో ఒక చిన్న సైజు కప్పు వుంది. కన్సొలేషన్ ప్రైజు ఇచ్చారట. నాకు ఆ వూరి సంగీత రసజ్ఞత పట్ల ఏవగింపు కలిగింది.

"బాబాయి కన్సొలేషన్ ప్రైజ్ అంటే సానుభూతి పూర్వక బహుమానమని వీళ్లర్థమేమో నీకు పాట రాదుగా. నీ వయసుని పట్టి ఖాళీ చేతులతో పంపడం ఇష్టం లేక ఈ కప్పుని నీ చేతుల్లో పెట్టుండవచ్చు" అన్నాను.

నా మాటల్లో బాబాయి మీద వున్న కసి వెళ్లగక్కే వుద్దేశంతో పాటు అతన్ని అవమానపర్చాలనే కోరిక కూడా వుంది. బాబాయి తొణకలేదు.

"నువ్వు ఎలాగైనా అనుకోరా సుబ్బిగా. ముందు ఫస్టు ప్రైజు కోసం పైరవీ చేశాను. కాస్త ఆలస్యంగా వచ్చాం కదా. అది మరెవరో తన్నుకుపోయారు. రిక్త హస్తాలతో మీ పిన్ని దగ్గరకు వెళ్లి మొహం చూపించలేక దీనితో సరిపెట్టుకున్నాను"

బాబాయికి ఇలాంటి మాటలతో కోపం తెప్పించలేను. మానసికంగా హింసించినా దాన్ని ఆయన అర్థం చేసుకోవడం లేదు. శారీరకంగా ఆయన్ను హింసించే శక్తి నాకు లేదు.

బాబాయికి తను జ్ఞానంగా భావించే అజ్ఞానం దిన దిన ప్రవర్ధమానమైపోతున్నది.. కానీ ఆ విషయం అతను ఒప్పుకోడు. తాను చెప్పిందే వేదం అనే బాపతు. బాగా చదువుకున్న వాళ్ల దగ్గరా, పెద్ద పెద్ద స్థాయిల్లో వున్న అధికారుల దగ్గరకు బాబాయి వెంట వెళితే తలవంపులు గావాల్సిన పరిస్థితి. అతనికి నవ్వు వస్తే చాలా బిగ్గరగా, పొట్ట కాళ్లు చేతులూ అన్నీ కదిలేలా అసహ్యంగా నవ్వుతాడు. నాకు అలా నవ్వడం అమర్యాద లక్షణంగా కనపడుతుంది. పదిమందిలో నేను ఎప్పుడూ పెద్దగా శబ్దం చేస్తూ నవ్వను. నవ్వినట్లుగా పెదాలు కదిలిస్తానంతే. బాబాయి అనాగరికుడు. అపరిపక్వకవి, అసమర్థ గాయకుడు, అప్రస్తుత ప్రసంగి, అర్హత లేకున్నా సర్వజ్ఞుడని తోటివాళ్లతో పిలిపించుకుంటున్న మోసకారి. పైపెచ్చు కీర్తికాముకుడు. అందరి చేతా మంచివాడనిపించుకోవాలనే తహతహ దేహం నిండా నింపుకున్నాడు. కూరగాయల మంచి చెడ్డా గురించి మాట్లాడినంత సులభంగా ప్రపంచ రాజకీయాల గురించి మాట్లాడబోతాడు. అతడంటే నాకు కసి. అతని చొరవంటే అసహ్యం. అతని కేవన్నా కీడు జరిగి అతని అహం దెబ్బ తినాలని తత్కారణంగా అతనిలో సమూలమైన మార్పు రావాలని నా ప్రగాఢ వాంఛ. దేవుడు నా కోరిక తీర్చేలా లేదు.

" ఇది విన్నావట్రా సుబ్బిగా సాయంత్రం టౌన్ హాల్లో తెలుగు కథా-మట్టి వాసనా" వగైరాల మీద చర్చవుందట. నేను పాల్గొంటున్నాను. నీ సంగతేమిటి?" అత్యుత్సాహంగా అడిగాడు.

ఈ మధ్య చాలా కాలంగా అతనికి మైకు ముట్టే


Every Tooth is like a Diamond
Diamonds are forever.....but Teeth are not.



" The mouth is delicate combination of skin, bone, muscles and teeth. The teeth are an amazing balance of form and functions, aesthetics and beauty. Take care of these gifts of God."

"PREVENTION IS BETTER THAN CURE "

- Rinse your mouth thoroughly after every meal
- Brush your teeth at least twice a day use a soft Tooth Brush.
- Tongue cleaning and massaging the gums daily with the fingertips twice a day removes the bacteria and prevents cavities and bad breath.
- Avoid taking sticky food and limit the intake of sweets.
- Eating hard and fibrous foods provide the best exercise for the teeth and gums.
- Clean your teeth by rinsing after every meal.
- Clean your interdentally areas with floss at least once a day.
- Avoid smoking, eating gutkhas, betel nut and pan which can cause cancerous lesions.
- Consult your Dentist once in six months.

Snatching victory out of the jaws of defeat" -A phrase that perfectly describes how a Dentist "rescues" teeth that have been ruined! It's a challenging task, that Sree Sree Dental Clinic is pleased to assist you with its range of Exclusive speciality Treatments

Dr. G.V.S.M.K.APPAJI B.D.S., FRHS.

SREE SREE DENTAL CLINIC
COSMETIC DENTAL CLINIC
1-1-365/6, Near Citizen Press, Gandhinagar, Hyderabad-500 020.
Ph: 27662548, 9849018589 E-mail.gvsmkappaji@yahoo.co.in

అవకాశం రాలేదు.

నేను సాధ్యమైనంత నమ్రతగా నాకు "మట్టివాసన" గురించి ఏమీ తెలియదని తెలుసుకోవడానికి శ్రోతగా వస్తానని తను మాట్లాడకుంటేనే బాగుంటుందని, లేని పక్షంలో నాలాంటివాడు నేర్చుకొనేదేమీ వుండకపోవచ్చని సవినయంగా మనవి చేశాను. కానీ ఆ సాయంత్రం సభలో పాల్గొని తనిష్టం వచ్చినట్లు మాట్లాడి ముగింపులో మటుకు "మట్టివాసన" చాలా అవసరమన్నాడు. యధావిధిగా ఒక మెమెంటో సంపాదించి స్టేజీ దిగాడు. నాకు దుఃఖం తెరలు తెరలుగా తన్నుకొస్తున్నది. లోకం ఎటుపోతున్నది. అభిరుచులు ఎందుకు దిగజారిపోతున్నాయి. మంచి చెడ్డా గమనించే ప్రేక్షక శ్రోతలకు కరువొచ్చిందా? నిర్వాహకులు బాబాయిలాంటి వాళ్లను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు. ఎంత రిట్రాగేషన్, ఎంత డిజనరేషను ఎంత డిగ్రేడేషన్. ఈ పరిస్థితులతో రాజీపడి జీవనం సాగించాల్సిందేనా. సాగించాల్సిందే.

ఇలా నన్ను నేను సముదాయించుకుంటూ గుంపులో గోవిందంలాగా బతుకుతున్నాను. బాబాయిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించను.

మా విషయంలో మార్పేమీ లేకుండా రోజులు గడిచిపోతున్నాయి. ఒకనాడు మా స్నేహ బృందం అంతా సరదాగా గడుపుతున్న సమయంలో బాబాయి హఠాత్తుగా ఉరుములేని పిడుగులాగా వచ్చిపడ్డాడు. నేను భయంతో వీపు చరుచుకున్నాను. బాబాయి తను రాసిన ఒక కవిత తీసి వినిపించాడు. బాబాయిని అవకాశం వచ్చినప్పుడల్లా అవమానపర్చే వుద్దేశ్యంతో వున్న నేను అతడిని మాటలతో కుళ్లబొడవాలనుకున్నాను.

గొంతులో సాధ్యమైనంత మంచితనం పలికిస్తూ "బాబాయి వాజ్‌పేయి గారికో హరివంశరాయ్ బచ్చన్" లాంటి ప్రముఖులతో నువ్వు కవితలు వినిపించాల్సిన అవసరముందని నొక్కి వక్కాణించాను.

ఆశ్చర్యంగా బాబాయి తన కోరికా అదేనని కొన్ని ఇహపరమైన ఇబ్బందుల వలన ఇప్పుడప్పుడే ఆ పని తలపెట్టలేకపోతున్నట్లు విషాదంగా ప్రకటించాడు.

"మరి వాళ్లకు హిందీలోనో, ఇంగ్లీషులోనో చెప్పాలి. నీకు ఆ రెండూ అంతబాగా వచ్చి చావవుగా" అన్నాను.

బాబాయ్ కించిత్ తొణకలేదు.

"ఒరే సుబ్బాయ్ మెట్రికు వరకూ హిందీ చదివానురా. మరీ అంత తీసిపారేయకు. వాళ్లకు హిందీలోనే వినిపిస్తా.

అనువాదానికి లాకాయి లుకాయిలు కాకుండా స్వీయానువాదం సదా అభిలషణీయం. మన భావం వాళ్లకు చేరుతుంది." కవితను లాల్చీ జేబులో తోస్తూ విలాసంగా కాళ్లాపుతున్నాడు. లాభం లేదు ఇతడిని మనం గెలవలేం.

అదే రోజు రాత్రి నా మిత్రుడు రామం అన్నాడు. బాబాయి పట్ల నా ప్రవర్తన ఏమీ బాగులేదట. బాబాయి చాలా మంచివాడుట. నేను బాబాయిని హేళన చేస్తున్నా తెలిసే వూరుకుంటున్నాడట. తన కంటే చిన్న వాడయిన కారణంగా నన్ను క్షమిస్తున్నాడట.

నేను ఖయ్యిమని లేచాను. ఏమిటీ బోడి ఆయన క్షమించేది. నేనే ఆయన్ను క్షమిస్తున్నాను., ఏ వేళ ఇంటికి వచ్చినా కాఫీ పోస్తున్నాను. కవితలు వింటున్నాను. పాట కూడా విన్నాను.

రామం తాపీగా చెప్పాడు. కవిత్వంలో సాహిత్యంలో బాబాయి వీక్ కావచ్చుకానీ ఒక మనిషిగా అతను అసామాన్యుడు. మానవ విలువల పట్లా మానవ సంబంధాల పట్లా అత్యంత గౌరవం కలవాడు.

నేను అంగీకరించదల్చుకోలేదు. బాబాయి మీద ద్వేషం నాకు తగదు. ఏ రోజు మొట్టమొదటగా అతని చేత 'ఒరేయ్' అనిపించుకున్నానో. దరిమిలా సుబ్బిగాడుగా మారానో ఆ విషాద సన్నివేశాలు నాకు ఇంత త్వరగా మరపుకురావు.

బాబాయికి తెలియని విషయం లేదు. కనీసం తను అలా అనుకుంటాడు. వేలు పెట్టని రంగంలేదు. అలా తన సర్వజ్ఞతను చాటుకుంటున్నప్పుడల్లా నేను తలవంపులు ఫీలవుతున్నాను.




నాకు లోలోన అతని మీద కసి, ద్వేషం ప్రబలిపోతున్నాయి. పైకి మాత్రం తప్పదు కనుక అతనితో ఆప్యాయత నటిస్తున్నాను.

ఒకనాడు బాబాయి స్వంత పనిమీద నన్ను హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. నేను వచ్చేటప్పుడు మా నియోజకవర్గపు ఎమ్మెల్యే గారిని కలిశాను. ఆయన తను కూడా మావూరు బయలుదేరుతున్నానని, తను ఒక్కడే కాబట్టి మేము ఇద్దరమూ అతని కారులో రావడానికి తనకభ్యంతరం లేదని చెప్పారు.

బాబాయి వెంటనే ఒప్పేసుకొని కారులో డ్రైవరు పక్కన ఆసీనుడయ్యాడు. నేనూ, ఎమ్మెల్యే గారూ వెనుక సీట్లో కూలబడ్డాము. నాకు గుండెల్లో దడ మొదలైంది. మా ప్రతినిధి ప్రతిపక్షానికి చెందినవాడు. బాబాయి అధికార పార్టీ సానుభూతిపరుడు. పైగా ఎవరన్నా ఏమైనా అనుకుంటారేమోననే ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడగల సమర్థుడు. ప్రతిపక్ష పార్టీ మీద దుమ్మెత్తిపోసి ఎక్కడో దారి మధ్యలో కారు దింపించేందుకు పాల్పడతాడేమోనని నా భయం. పోతే మా ఎమ్మెల్యే ప్రతిపక్షమైనా మా నియోజకవర్గపు సమస్యలతో సహా మిగతా ప్రపంచం గురించి అంత లోతుగా ఆ మాటకొస్తే-అసలు ఏమీ తెలియదని నా ప్రగాఢ విశ్వాసం. కారు హైదరాబాద్ పొలిమేరలు దాటగానే....

ఎమ్మెల్యేగారు భ్రుకుటి ముడిచి సీరియస్‌గా ''మరి దాని విషయం ఏం ఆలోచించావు. ఈ విషయంలో నీ వైఖరేమిటో ముందుగా స్పష్టం చేయాలి'' అని నన్ను డిమాండ్ చేశారు.

నాకు గుండె ఝల్లుమంది. ఇతను నాకే విషయమూ చెప్పలేదే. ఇక స్పష్టం చేసే ప్రసక్తి ఎక్కడది. ఇలా ఆలోచిస్తూ జవాబు నానుస్తుంటే

''ఇలా నాన్చడం కాదు. స్పష్టం చేసి తీరాలంటే'' అని నా కాలరు పట్టుకున్నాడు.

నాకు ముచ్చెమట్లు పోశాయి. అకస్మాత్తుగా నన్ను చలి ఆవరించింది. ఆ చలి నా వెన్నెముకలో జన్మించి వళ్లంతా పాకిన భయం తాలూకుదని పోల్చుకున్నాను.

బాబాయి మటుకు నిమ్మకు నీరెత్తినట్లుగా వక్కపొడి నములుతూ కారు ముందు వెళుతున్న లారీలను చూస్తున్నాడు. వాటి వెనుక ''దేవదాసు, కలిసుందాం రా, సాయిదయ'' ఇత్యాది పేర్లు కనిపిస్తున్నాయి.

చిన్నగా గొణిగాను. ''ఏం సంగతిసార్-మరిచిపోయాను''

''అలాగే మరిచిపోతారోయ్... అదే ప్రపంచీకరణ దుష్ఫలితాల సంగతి'' అన్నాడు.

నా వళ్లు మామూలు వుష్ణోగ్రతను సంతరించుకుంది. ''అదా ఇంకా ఆలోచిస్తున్నాను సార్'' వుత్సాహంగా అన్నాను. ఎందుకంటే దాని గురించి నాకేమీ తెలియదు. నాలాంటి ప్రపంచస్థాయి మేధావికే తెలియనప్పుడు అతనికి తెలిసే అవకాశం లేదు. ప్రతిపక్ష హోదాలో ఏదో ఒకటి అనాలని అంటున్నాడని అర్థమైంది.

బాబాయి గొంతు సవరించుకొని ఏదో చెప్పడానికి సన్నద్ధమయ్యాడు.

''ఎమ్మెల్యేగారూ-ప్రపంచీకరణ మన రాష్ట్ర లారీల యజమానులను కూడా చావు దెబ్బ తీస్తున్నది'' అన్నాడు.

''అదెలా?''

''ఎలాగా? జపాను వాడు ఒకలారీ కొనుక్కుని ఇదే రోడ్డు మీద ఇసుక లోడ్లు తోలుతున్నాడు. చూడండి. ఎక్కడి జపాను? ఎక్కడి హైదరాబాద్? ''ఆ లారీ ఇప్పుడే మన కారు దాటుకుని పోయింది''

ఎమ్మెల్యే గారికి ఆ లారీ చూసి తీరాలని పట్టుదల వచ్చి కారు స్పీడుగా పోనీయమన్నారు.

కొంతదూరం పోయిన తర్వాత ఒక డొక్కు లారీ వెనుక భాగం కనిపించింది. బాబాయి వుత్సాహంగా అరిచాడు.''అదే అదే అదే జపానోడి లారీ''

నేనూ ఎమ్మెల్యే కొంగల్లా మెడలు రిక్కరించి చూసేసరికి ఆ లారీ వెనుక ''మకిదువా'' అన్న అక్షరాలు కనిపించాయి. బాబాయి తాపీగా చెప్పాడు. లారీ ఓనరు పేరు ''మకిదువా'' వూరు టోకియో పక్కన ''కిసలయ'' అనే పల్లె.

స్థానిక లారీ యజమానుల నోట్లో ఇసుక కొట్టి ''మకిదువా'' చేస్తున్న అన్యాయాలను రేపు అసెంబ్లీ సమావేశాల్లో సభ్యుల దృష్టికి తీసుకొస్తానని ఎమ్మె


## అమ్మతనంలోని కమ్మదనం అందరికీ సాధ్యం?



సంతాన లోపాలు కనుగొనేందుకు 2 గం॥లు సమయం వెచ్చిస్తే చాలు. ఉభయులలో లోపం ఎక్కడ వున్న మీ ముందు విస్పష్టం.

గత 25 సం॥లు నుండి దేశదేశాల లోను సంతానం లేని దంపతులకు సంతానాన్ని పొందటంలో మేము ఘన విజయాన్ని సాధించాం. మా అత్యాధునిక I.V.F. లాప్రోస్కోప్ సెంటర్ నందు సంతానం లేని దంపతులకు అడ్వాన్స్‌డ్ I.V.F. (టెస్ట్‌ట్యూబ్ బేబి) ట్రీట్‌మెంట్‌ను కిరణ్ ఫెర్టిలిటి అందుబాటు లోనికి తెచ్చినది.

### విజ్ఞప్తి



డా॥ కిరణ్ మరియు సంతానం పొందిన తల్లిబిడ్డలు

సంతానం లేనివారికి గొప్ప సదవకాశం. చిన్న మనవి... సంతానం లేదని దిగులు చెందుతున్నారా?
నేను మీలాగే చాలా దిగులుపడి వున్నాను. సంతానము కలగ లేదని ఎన్నో చిన్నా చితక హాస్పిటల్స్ మరియు గుళ్ళు గోపురాలకు తిరిగి విసిగిపోయి ఎన్నో డబ్బులు ఖర్చుపెట్టినాను. అయిననూ ఫలితం కలగలేదు. నేను కిరణ్ ఫెర్టిలిటి యాడ్‌ను పేపర్‌లో చూసి డాక్టర్ కిరణ్‌గారిని సంప్రదించినాను. అందుకుగాను డా॥ కిరణ్‌గారు నాకు ఖచ్చితమైన రోగ నిర్ధారణ పరీక్షలు జరిపి ఖచ్చితమైన ట్రీట్‌మెంట్‌ను అందించగలిగినారు. అందువలన నేను మంచి పండంటి బాబును కలిగినాను. నేను మా వారు మా కుటుంబ సభ్యులందరూ చాలా సంతోషంగా వున్నాము. మరి ఎందుకు ఆలస్యము మన కిరణ్ ఫెర్టిలిటీ వుంది మీ చెంత.

**ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులో ఆధునిక వైద్యం**

**అన్ని రకాల ఇన్‌ఫెర్టిలిటి ప్రాబ్లమ్స్‌పైన 50% డిస్కౌంట్ ఇవ్వబడును. దీపావళి మరియు రంజాన్ సందర్భంగా**

5 సం॥రములు మించి వైవాహిక జీవితం గడిపిన దంపతులకు అతి తక్కువ స్పెర్మ్‌కౌంట్ వంటి పురుష సంబంధమైన .ICSI ట్రీట్‌మెంట్ ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజక్షన్ సౌకర్యం. హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్, టెస్ట్‌ట్యూబ్, టెస్ట్‌ట్యూబ్ బేబి ఊసైటి/ ఎంబ్రో డొనేషన్ ప్రోగ్రామ్స్ సౌకర్యాలు కలవు.

**సాయికిరణ్ ఇన్‌ఫెర్టిలిటి & టెస్ట్‌ట్యూబ్ బేబి హాస్పిటల్**

6-2-966/4, హింది ప్రచార సభ ఎదురుగా, నిర్మలా స్కూల్ ప్రక్కన, ఖైరతాబాద్, హైదరాబాద్
ఫోన్: 040-65215768, 65549313, సెల్: 9849000260

ల్యేగారు బాబాయి భుజం తట్టి వాగ్దానం చేశాడు.

తన పేరు కూడా అసెంబ్లీలో చెప్పమని బాబాయి ఎమ్మెల్యేగారిని ప్రార్థించాడు.

నాకేమీ పాలుపోవడం లేదు. వాళ్లిద్దరూ కారు ఆపించుకొని దిగి ఆలింగనపూర్వకంగా పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.

నేను గట్టిగా అరిచాను. ''మకిదువా'' లేదు మట్టిగడ్డలు లేదు''మాకిదువా అంటే అమ్మదయ వాడెవడో లారీ యజమాని తన మాతృప్రేమ చాటుకునేందుకు పూనుకుంటే పెయింటర్ చేసిన నిర్వాకమిది.''

అంతే బాబాయి సింహంలా గర్జిస్తూ నాకు లోక జ్ఞానం లేదని తేల్చేశాడు.

సరేనని ఒప్పుకొన్నాను.

ఇంత జరుగుతున్నా ఒక విషయం నేను శ్రద్ధగా గమనించాను. గణపతి నవరాత్రులయినా దేవీ నవ రాత్రులయినా బాబాయి చందా పుస్తకం పట్టుకుని మా కాలనీలో ఇల్లిల్లూ తిరిగి ఆయా వుత్సవాలని ఘనంగా నిర్వహింపజేసేవాడు. నాకు ఈ పను లంటే చెడ్డ అసహ్యం. వీధి మొదట్లో వున్న వినా యక విగ్రహానికి నమస్కరించడాన్ని కూడా నేను అవమానం ఫీలయ్యేవాడిని. బాబాయి మటుకు ఆ తొమ్మిది రోజులు రీఛార్జి చేసిన బ్యాటరీలా ప్రకాశ వంతంగా వుల్లాసంగా కనిపించేవాడు. నేను రాను బాబోయి అన్నా మెడలు పట్టి పందింట్లోకి లాక్కె ళ్లేవాడు. అదేమి చిత్రమో బాబాయిని నేను ఎంత అసహ్యించుకుంటానో జనం అంతకు పదిరెట్లు అత నికి గౌరవం ఇచ్చేవారు. బాబాయికి క్షుద్రశక్తులేవో పట్టుపడి జనాకర్షణ కలిగిస్తున్నాయనుకొన్నాను.

ఒక రోజు రామాన్నడిగాను. ''బాబాయి కానీ వామాచార తంత్రాలేమైనా పాటిస్తున్నాడురా? వీడి దుంపతెగ ఎందుకురా మీరంతా వాడంటే అలా పడి చస్తారు?''

రామం నాకేసి తీక్షణంగా చూసి ఖాండ్రించి వుమ్మేసి ''ఒరేయ్ సుబ్బారావు నువ్వేదో మంచి వుద్యోగం చేసుకుంటూ నాలుగు కథలు రాసి, స్టేజీ మీద నాలుగు బోడి మాటలు మాట్లాడి గొప్పోడిన నిపించుకుంటున్నావు. బాబాయి గొప్పతనం నీకు తెలియదురా. బాబాయికి జీవితం తెలుసు. తోటి మానవుల పట్ల తన బాధ్యత తెలుసు నీలాగా కుహనా సంస్కారం ప్రదర్శించనంత మాత్రాన బాబాయి ఏరకంగానూ తక్కువ వాడు కాదు.

నువ్వు పుస్తకాలు చదివి జీవితాన్ని చూస్తు న్నావు. బాబాయి జీవితాన్ని చూస్తున్నాడు బాబాయి జీవితాన్నే చదివాడు. చదువుతున్నాడు. చదువుతూనే వుంటాడు.''

నాకు బాగా కోపం వచ్చింది. '' ఏంటి బోడి జీవితం అని చదివింది సంస్కారంలేని బ్రూట్'' అన్నాను.

రామం సీరియస్‌గా చూశాడు. వాడు బాబాల భక్తుడిలాగా బాబాయి భక్తుడు.

తన్నినా తన్నగలడని ముందుచూపుతో గ్రహించి ''పోరా నువ్వూ మీ బాబాయి కట్టగట్టు కొని చెర్లో దూకండి'' అంటూ కదిలాను.

ఒక రోజు ఒక జ్యోతిష్కుడు వద్దంటున్నా వినక మా ఇంట్లోకి వచ్చి సుఖాసీనుడయ్యాడు. నా నక్షత్రం చెప్పమన్నాడు.

''పునర్వసు మూడోపాదం'' అని చెప్పాను.

బాబాయి ఎంత సేపయిందో వచ్చి తలుపు దగ్గర వున్నాడు.

''ఇకనేం పునర్వసు మూడోపాదం అంటే మిథు నరాశి అన్నమాట. ప్రస్తుతం ఏలిన్నాటి శని నడు స్తోంది. ఈ సంవత్సరం పంచమస్థానంలో గురువు. ద్వితీయ స్థానంలో శని, దశమ భాగ్య స్థానంలోకి రాహువు ప్రధాన ఫలితాలు నిర్దేశిస్తారోయ్. అక్టో బరు చివరకి గురువు ఆరోస్థానంలోకి వెళతాడు. శుభా శుభ మిశ్రమ ఫలితాలనుకో'' అంటూ ఆగాడు బాబాయి. జ్యోతిష్య సిద్ధాంతి కూడా బాబాయితో ఏకీభవిస్తూ సెలవు పుచ్చుకున్నాడు.

నాకు మంట నసాళానికంటింది.

బాబాయి ఆఖరికి జ్యోతిష్యం చెప్పించుకునే స్వేచ్ఛ కూడా హరించాడు. అతడే నాకు శని అని నిర్ధారించుకొన్నాను.

ఒక ఆదివారం నాడు సాయంత్రం నేనూ బాబాయి వాళ్ల ఇంటికొస్తున్నాం. దారిలో ఓ


NCMDT - ద్వారా కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యంలో

మల్టీమీడియా యానిమేషన్ కోర్సుల్లో శిక్షణ

కోర్సుల వివరాలు :

1. మీడియా యానిమేటర్
2. మీడియా డిజైనర్
3. వెబ్ డిజైనర్
4. పిజి డిప్లమా ఇన్ యానిమేషన్ టెక్నాలజీ
5. పిజి డిప్లమా ఇన్ మల్టీమీడియా యానిమేషన్





60% వరకు ఫీజులో రాయితీ/తగ్గింపు

NCMDT సెంటర్ ఫర్ మల్టీమీడియా డిజైన్ అండ్ ట్రైనింగ్

(ISO 9001:2000 సర్టిఫైడ్, కేంద్రప్రభుత్వరంగ సంస్థ ఆమోదిత శిక్షణాకేంద్రం)

నేడు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మల్టీమీడియా, యానిమేషన్ రంగాలలో అత్యధికంగా అవసరమవు తున్న ఉద్యోగాలను దృష్టిలో ఉంచుకొని మల్టీ మీడియా రంగంలో శిక్షణను అందించుట ద్వారా యువతీ యువకు లకు ఉద్యోగ అవకాశాలను పెంపొం దించేందుకు కేంద్రప్రభుత్వరంగ సంస్థ అమోదిత మల్టీమీడియా యాని మేషన్ కోర్సుల్లో NCMDT 60% వరకు ట్యూషన్‌ఫీజులో రాయితీ/ తగ్గింపునిస్తూ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి శిక్షణకు ఎంపికకై రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు కోరబడు చున్నవి.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తెల్లకాగితంపై దరఖాస్తు చేస్తున్న కోర్సు పేరు, అభ్యర్థి పేరు, తండ్రి పేరు, వృత్తి, వార్షిక ఆదాయం, పుట్టిన తేది, చిరునామా, విద్యార్హత, మార్కులు, రిజర్వేషన్, దగ్గరలోని శిక్షణాకేంద్రము, అభ్యర్థి సంతకము జతపరుస్తూ సెలక్షన్ లెటర్ పంపించుట కొరకు అయిదు రూపాయల పోస్టల్ స్టాంప్ అంటించిన స్వంత చిరునామా గల కవర్‌ను క్రింది అడ్రస్‌కు 15 రోజులలోగా అందేట ట్లుగా పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపవలెను. చివరితేదీ తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులకు శిక్షణా కేంద్రం వివరాలు, కోర్సు బ్రోచర్, సెలక్షన్ లెటర్ పోస్టు ద్వారా పంపించబడును.

దరఖాస్తు పంపవలసిన చిరునామా :

NCMDT Centre for Multimedia Design And Training

NCMDT Block, C-201, Mayur Kushal Complex,Beside Chermas, Abids, Hyderabad - 500 001. Ph : 040 - 23298720, 23298721 Cell : 9347525128

మల్టీమీడియా యానిమేషన్ కోర్సులలో శిక్షణ నిర్వహించుటకు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్/స్టడీ సెంటర్‌కై ఫోన్ చేయండి : 9347525128, 040-23298720



కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో

కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ కోర్సు [CTTC]

మాంటిస్సోరి (నర్సరీ), ప్రీ-ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులు

ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ చేస్తున్న/చేసిన విద్యార్థినీ విద్యార్థుల నుండి రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల ఆహ్వానము - 2006



కేంద్రప్రభుత్వరంగసంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 180 ఐ.టి. మాస్టర్ ఫౌండేషన్ ఆమోదిత శిక్షణా కేంద్రాల ద్వారా నిర్వహించ బడు పై కోర్సులలో శిక్షణ పొందుటకు ఆసక్తిగల అభ్య ర్థుల నుండి ఎంపికకై దరఖాస్తులు కోరబడు చున్నవి.

కంప్యూటర్ టీచర్ ట్రైనింగ్ కోర్సు (సి.టి.టి.సి) - 12 నెలలు, మాంటిస్సోరి (నర్సరీ)-డి.ఎం.టి.టి.సి- 6 నెలలు, పి.పి.టి. టి.సి.- 6 నెలలు, టెన్త్‌పాస్, ఇంటర్, డిగ్రీ చేసిన, చేస్తున్న వారు, నిరుద్యో గులు, దరఖాస్తు చేసుకో వచ్చు. శిక్షణ పూర్తి అయిన తరువాత కేంద్రప్రభుత్వ రంగసంస్థ ఆమోదిత ఐ.టి. మాస్టర్ ఫౌండేషన్‌సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ఉద్యోగావకాశాలు : నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని స్కూళ్లలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రవేశ పెట్టడం తో అటు ప్రభుత్వ గుర్తింపు గల స్కూళ్లలోను, ఇటు ప్రైవేటు స్కూళ్లలోను లక్షలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్ప డ్డాయి. ఈ కోర్సు చేసిన అభ్యర్థులకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపు గల ప్రైవేట్ / ప్రభుత్వేతర స్కూళ్లలో మరియు వివిధ విద్యాసంస్థలలో, కంప్యూ టర్ టీచర్స్‌గా, ఇన్‌స్ట్ర క్టర్స్‌గా, ల్యాబ్ ఫాకల్టీగా, స్కూల్ కంప్యూటర్ ఆపరే టర్స్‌గా వివిధ ఉపాధి అవకాశాలు కలవు.

ఎస్.సి., ఎస్.టి., బి.సి. విద్యార్థులకు, ప్రత్యేక రిజర్వేషన్‌తోపాటు 25% ఫీజు తగ్గింపు కలదు.

ఆసక్తి గలవారు తెల్ల కాగితంపై పేరు, తండ్రి పేరు, విద్యార్హత, కులము, వార్షిక ఆదాయము, చిరునామా, దగ్గరలోని శిక్షణా ప్రాంతము వ్రాసి, సంతకం చేసి స్వంత చిరునామా గల కవరును జతచేసి 15 రోజుల లోపల దిగువ చిరునామాకు పంపవలెను.

చిరునామా : ప్రోగ్రామ్ డైరెక్టర్, ఐ.టి. మాస్టర్ ఫౌండేషన్, 303, కోణార్క్ దయాగ్నస్టిక్ సెంటర్ పైన, కోణార్క్ టవర్స్, దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36. ఫోన్ : 98660 61936, 040-65977195

మా సంస్థ ప్రాతినిధ్యంలేని ప్రాంతాలలో పై శిక్షణ కార్యక్రమం నిర్వహించు టకు కంప్యూటర్ శిక్షణా సంస్థలు, కంప్యూటర్లు కలిగియున్న స్కూల్స్, కాలేజీలు ఫ్రాంచైజీకై సంప్రదించండి. ఫోన్ : 98660 61936

IT MASTER FOUNDATION
SKILL DEVELOPMENT LEARNING CENTRE

• కేంద్ర ప్రభుత్వరంగసంస్థ ఆమోదిత సర్టిఫికేషన్ • ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ • ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

మూడేళ్ల కుర్రవాడు గుక్కపట్టి ఏడుస్తూ కనిపించాడు. వాడికి సంబంధించిన వారెవరూ పరిసరాల్లో కనిపించలేదు. బహుశా తల్లి చూడకుండా బయటకి వచ్చి దారితప్పి వుంటాడు.

బాబాయి పరిగెత్తికెళ్లి వాడిని ఎత్తుకున్నాడు.

''మనకెందుకు వచ్చిన తంటా వదిలెయ్యి బాబాయ్'' నిర్లక్ష్యంగా అన్నాను.

బాబాయ్ వినిపించుకోలేదు. పిల్లాడినెత్తుకొని ఎదురుగా కనిపిస్తున్న సందులోకి వెళ్లిపోయాడు.

ఈ పిల్లవాడినెవరో కిడ్నాప్ చేసి వుంటారు. వీడిని మన దగ్గర చూస్తే ఆ నేరం మన మీద పడొచ్చు. ఆ పైన పోలీసులు కేసూ గట్రా మన కెందుకు కొచ్చిన తద్దినం అని చప్పుడు కాకుండా ఇంటికెళ్లి టీవీ ముందు కూలబడ్డాను.

మర్నాడు బాబాయి వచ్చి ఆ కుర్రాడిని వాడి తల్లి కొప్పజెప్పానని, ఆ తల్లి కళ్లలో కనిపించిన ఆనందం, కృతజ్ఞతాభావం తనెన్నడూ మర్చిపోలేనని చెప్పాడు.

''కొయ్యి రాజా కొయ్యి'' అని మనసులో అనుకొన్నాను. వెంటనే నా ఆలోచన తప్పని నాకే తోచింది. బాబాయి తప్పో ఒప్పో తన మనసులో వున్నది చేసి తీర్తాడు. కానీ అబద్ధాలుచెప్పడు. ఆ పిల్లవాడిని నిజంగానే తల్లికి చేర్చివుంటాడు. బాబాయి నిజంగా మంచి వాడేనేమో. నేనే అతడిని ఇన్నాళ్లుగా అనవసరంగా తప్పుగా అర్థం చేసుకుంటున్నానేమో.

మరో రెండు రోజుల తర్వాత బజారులో బాబాయి ఎదురుపడ్డాడు. తన సహజ నైజాన్ననుసరించి

''ఎటుల్తైన్నావురా సుబ్బూ- అంటే సుబ్బిగా'' అడిగాడు.

''కొత్త సిద్ధాంతి ఎవరో సిద్ధార్థా లాడ్జిలో దిగాడు. జాతకం చూపించుకోవడానికి '' నిజమే చెప్పాను.

బాబాయి గట్టిగా పిడుగులు పడ్డట్లుగా నవ్వి '' నీ జాతకం నేనుచెప్తాను కదరా. మళ్లీ ఎందుకు డబ్బు దండగ. ఆ డబ్బుతో ఒక బీదవాడికి అన్నం పెట్టు. ఒరేయ్ నీకొకటి చెప్పనా. మన చేతలు మన నడవడి మన వర్తమానమే మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి.'' పద వెనక్కి అంటూ లాక్కొచ్చాడు. నాకు బాబాయి కొంచెం మంచివాడిలా కనపడడం మొదలుపెట్టాడు. కానీ పూర్తిగా నమ్మలేకపోతున్నాను.

ఒకనాడు వుదయాన్నే మా ఇంటికి మూడిళ్లవతల ఒక ఇంట్లో నుంచి ఏడుపులూ పెడ బొబ్బలూ వినపడ్డాయి. ఆదుర్దాగా వెళ్లి చూద్దును కదా మా సెంటర్లో చిన్న హోటలు నడుపుకునే అరవ బ్రాహ్మణుడు గుండె మీద చేయి వేసుకొని బాధతో కూలబడ్డాడు.

అతడికి హార్ట్ ఎటాక్ వచ్చిందని గ్రహించాను. అర్జెంటుగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అంబులెన్స్‌కు ఫోన్ చేయాలనే ఆలోచన వచ్చినా నాకెందుకొచ్చిన తంటా వాళ్ల దగ్గర డబ్బు లేకపోతే భారం మన మీద పడుతుందని సంశయిస్తున్నాను. అంబులెన్స్ రానూ వచ్చింది.

ముందుసీట్లో నుంచి బాబాయి దిగనే దిగాడు. క్షణం వృథా చేయకుండా రోగిని సునాయసంగా అంబులెన్స్‌లోకి చేర్చాడు. విస్మయంతో చూస్తున్న నా కేసి ఒక చిరునవ్వు విసిరి అంబులెన్స్‌లో వెళ్లిపోయాడు.

చుట్టూ ఇంతమంది వున్నా ఎవరూ పూనుకోక పోయినా బాబాయి మనిషిగా తన కర్తవ్యం నిర్వహించాడు. నాకెందుకో మొదటిసారిగా బాబాయిని అనవసరంగా దూషిస్తున్నానా అని శంక మొదలైంది.

మధ్యాహ్నానికల్లా అరవాయనను హైదరాబాద్ తీసుకెళ్లారని బాబాయి ఆ కుటుంబం వెంట వున్నాడని తెలిసింది. నాలో ఒకరకమైన భావోద్వేగం మొదలైంది. ఆత్మ పరిశీలన చేసుకోవడం మొదలు పెట్టాను.

బాబాయి పరిస్థితిలో నేనుంటే? నేను ముందు గడ్డం గీసుకోవాలి. స్నానం చెయ్యాలి. ముస్తాబు కావాలి. బట్టనలగకుండా వెళ్లాలి. మరి బాబాయి ఇవేమి లేకుండానే ''సిరికంజెప్పడు'' లాగా వెళ్లిపోయ్యాడు. బాబాయి పట్ల నా ద్వేషం స్థానంలో అభిమానం చోటుచేసుకోసాగింది.

మధ్యాహ్నానికల్లా కొత్త వార్తలొచ్చాయి. అరవ పెద్దమనిషిని జాయిన్ చేసిన ఆస్పత్రి తాలూకు వాళ్లు ముందు పాతికవేలు కట్టమన్నారట. సర్జరీ అవసరమైతే చేస్తాము. దాదాపు రెండు లక్షలు కావాలన్నారట. రోగి భార్య దగ్గర పుస్తెలు తప్ప మరేమీ లేవట. చిత్రంగా బాబాయి పిన్నికి ఫోన్ చేసి పాతిక వేలు తెప్పించి ఆస్పత్రిలో కట్టాడట. బాబాయి ఈ మధ్య ప్రావిడెంట్ ఫండ్ పార్ట్ ఫైనలు విత్‌డ్రా చేసి పిన్నిపేర దాయించాట్ట. అదిగో ఆవిడ అవి డ్రా చేసి బాబాయికి పట్టుకెళ్లి ఇచ్చింది. ఈ సంగతి తెలియగానే నా కళ్లకు పొరలు తొలగిపోయాయి. వాళ్లిద్దరూ ఆది దంపతుల్లాగా కనిపించారు.

మధ్యాహ్నం ఈ వార్త విన్నాను. రాత్రికల్లా అరవ్వాయన చనిపోయిన వార్త వచ్చింది. ఆస్పత్రి వాళ్లు శవం ఇవ్వడానికి కొంత పేచీ పెట్టారు. కానీ బాబాయి రుద్రాకారం దాల్చి ఆస్పత్రి సూపర్నెంటును తొడ కొట్టి సవాలు చేశాట్ట. అరవ్వాయన శవం ఇవ్వకపోతే సూపర్నెంటు శవాన్ని పట్టుకెళతానని పబ్లిగ్గా ప్రకటించి ''ఒరే సూపర్నెంటూ తేల్చుకో ఆ శవాన్నిస్తావా? నీ శవం పట్టుకెళ్లమంటావా? అని ఛాన్సు అతనికే ఇస్తూ హూంకరించాడట.

దాంతో వాళ్లు శవాన్ని అర్జెంటుగా బాబాయికిచ్చేశారట. అర్ధరాత్రి కల్లా మావూరు తెచ్చేశారు.

తమిళనాడు నుంచి కొద్దిమంది బంధువులు వచ్చారు. మర్నాడు దహన కార్యక్రమాలు బాబాయి దగ్గరుండి జరిపించాడు. శవవాహకుల్లో ఒకడైన బాబాయి నన్ను చూసి విషాదంగా నవ్వాడు. బాబాయి విశ్వరూపం నాకు గోచరించింది. రెండు చేతులతో మనసారా నమస్కరించాను.

బాబాయి కవి కాదు. గాయకుడు అసలే కాడు. వక్త కూడా కాడు. రచయిత కాదు. అయితేనేం అందరూ మాటల్లో చెప్పే మానవత్వం సోదర ప్రేమ ఆచరించి చూపిన మహానుభావుడు. ఇవేమి కాకున్నా అతనంటే నాకిష్టం.

ఆ సాయంత్రం బాబాయి దగ్గరకు వెళ్లాను.

''ఏం సుబ్రావ్'' అన్నాడు

''కాదు బాబాయి. నువ్వు నన్ను సుబ్బిగా అను సంతోషంగా వుంటుంది'' అన్నాను.

